# ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 319 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## కాంగ్రెస్ పార్టీని
# బలహీనపర్చేందుకు కుట్రలు



**నరేందర్‌రెడ్డి పట్టభద్రులకు ప్రభుత్వానికి వారధిగా ఉంటాడు**

**ఫామ్‌హౌస్‌కే కేసీఆర్ పరిమితం**

**బీఆర్ఎస్ ఎవరికి ఓటు వేయాలో బహిర్గతం చేయాలి**

**పోటీకి నిలపడనివారే ఎలా ప్రశ్నిస్తారు : సీఎం రేవంత్‌రెడ్డి**

**నిజామాబాద్, ఫిబ్రవరి 24 (ప్రభాత ఉదయం):** ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి ప్రభుత్వానికి, పట్టభద్రులకు మధ్య వారధిగా ఉంటారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీని బలహీన పర్చే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరిస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌లో పడుకున్నారని.. బీఆర్ఎస్ నాయకులు ఏ అభ్యర్థికి ఓటు వేయాలని చెబుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించవద్దని ప్రచారం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి నిలబడని బీఆర్ఎస్ రాజకీయ పార్టీఏ కాదన్నారు. పోటీకి నిలబడని వారు కాంగ్రెస్‌ను ఎలా ప్రశ్నిస్తారని నిలదీశారు. తమకు పరిపాలించే అవకాశం తక్కువగా వచ్చిందని.. అయినా 55,163 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పుకొచ్చారు. స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని.. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్ వన్ పోస్టు ఇచ్చామన్నారు. వరంగల్‌కు చెందిన దీప్తికి గ్రూప్ 2 ఉద్యోగం ఇచ్చినట్లు చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులను ముప్పుతిప్పలు పెట్టారని.. పదేళ్ల పాటు కోచింగ్ సెంటర్ల చుట్టూ తిప్పారని విమర్శించారు. "నేను చెప్పింది నిజమైతేనే మాకు ఓటు వేయండి" అని కోరారు. నిజామాబాద్ రైతులు పంజాబ్ రైతులతో పోటీపడి పంటలు పండిస్తారన్నారు. రైతు రుణమాఫీ చేశామని.. రైతు భరోసా ఇచ్చామని తెలిపారు. కేసీఆర్ సర్కారు చేసిన అప్పుకు ఇంత వరకు 75 వేల కోట్ల వడ్డీ కట్టామన్నారు. తాను సీఎం అయ్యాక ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీనెల ఒకటో తేదీన జీతం

..మిగతా 2లో



## హైదరాబాద్ మెట్రో విస్తరణకు
# అడ్డుపుల్ల

**మూసీ సుందరీకరణ అడ్డుకుంటున్న కిషన్ రెడ్డి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**నిజామబాద్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సిఎం**

**బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర ఆగ్రహం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ప్రభాత ఉదయం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. ఒకరు కేటీఆర్ అరెస్ట్‌ను అడ్డుకుంటుంటే, మరొకరు హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. నిజామబాద్‌లో శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మాట్లడుతూ బిఆర్ఎస్, బీజేపీపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ విషయంలో కేంద్రం సహకరించకుండా తెలంగాణకు చెందిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు రేవంత్. మెట్రో విస్తరణకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేగంగా కార్యచరణ మొదలుపెట్టింది. నిధులు కొరత

..మిగతా 2లో

# 8 మందిని గుర్తించే ప్రక్రియ వేగవంతం


**ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ తో పాటు నేవీ, ఆర్మీ రంగంలోకి**

**'ఆక్వా ఐ' పరికరాన్ని పంపించిన నేవీ**

**కొనసాగుతున్న సహాయక చర్యలు**

**నాలుగైదు అడుగుల మేర బురద, నీరు చేరిక**

**పరిస్థితిపై సీఎం రేవంత్ ఆరా**




నాగర్ కర్నూలు, ఫిబ్రవరి 24 (ప్రభాత ఉదయం): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం లోపల చిక్కుకున్న 8 మందిని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేశారు. లోపల చిక్కుకున్న వారిని గుర్తించేందుకు నేవీ టీమ్ "ఆక్వా ఐ" పరికరాన్ని టన్నెల్ లోపలికి పంపించింది. గత మూడు రోజులుగా టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని బయటకు తెచ్చేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ లోపల నాలుగైదు అడుగుల మేర బురద, నీరు ఉన్న కారణంగా వారి వద్దకు చేరుకోవడం కష్టంగా మారింది. నాగర్ కర్నూలు జిల్లాలోని దోమలపెంట సమీపంలో SLBC టన్నెల్ లోపల 14వ కిలోమీటర్ వద్ద


..మిగతా 2లో

## వారణాసి రోడ్డు ప్రమాదంలో
# సంగారెడ్డి వాసులు మృతి

**కుంభమేళాకు వెళ్లి వస్తుండగా ఘటన**



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ప్రభాత ఉదయం): ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు మృతిచెందారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఇరిగేషన్ డీఈ వెంకటరామిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లారు. పుణ్యస్నానం ఆచరించి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో వారణాసి వద్ద వారు ప్రయాణిస్తున్న కారు టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన వెకంటరామి రెడ్డి, ఆయన సతీమణి విలాసిని, కారు డ్రైవర్ న్యాల్‌కల్ మండలానికి చెందిన మల్లారెడ్డి అక్కడికక్కడే మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వారిని సమీపంలోని దవాఖానకు తరలించారు.




## భారత్ మాటలే కాదు..
# చేతల్లో చూపిస్తున్నాం

**వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశం**

**ప్రపంచ బ్యాంక్ వ్యాఖ్యలను గుర్తు చేసిన ప్రధాని**

**గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో ప్రధాని మోడీ**

**భోపాల్, ఫిబ్రవరి 24 (ప్రభాత ఉదయం):** భారత్ మాటలకే పరిమితం కావడం లేదని, చేతల్లోను చూపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఆర్థికరంగంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా కొనసాగుతోందని ప్రపంచ బ్యాంకు చెప్పిందని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతోన్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సోమవారం

..మిగతా 2లో

# మానసిక క్షోభలో రాష్ట్ర ఉద్యోగులు



**రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించలేని దుస్థితి**

**ఫీజు రియంబర్స్‌మెంట్‌లో పూర్తి వివక్ష**

**14నెలల మీ పాలనలో ఏ వర్గం సంతృప్తిగా లేదు**

**ఇదంతా వదిలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో**

**ఓట్లు ఎలా అడుగుతారు**

**సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిని కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ప్రభాత ఉదయం):** రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేయడం ఎంతవరకు న్యాయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో 14 నెలల కాంగ్రెస్ పాలన అసంతృప్తిగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువత, పెన్షనర్లు, కళాశాలల యాజమాన్యాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, నిర్లక్ష్య ధోరణిపట్ల భారతీయ జనతా పార్టీ పక్షాన తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నామని కిషన్ రెడ్డి అన్నారు. 14నెలల మీ పాలనలో ఆయా వర్గాలేవీ సంతృప్తిగా లేరనేది నిస్సందేహమని, ఎన్నికల్లో వారికి ఇచ్చిన హామీలను సైతం మీరు ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తున్నారంటూ ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. వాళ్లకు దక్కాల్సిన న్యాయమైన హక్కులను కూడా కాలరాస్తున్నారని, ఆఖరుకు ఉద్యోగులకు, పెన్షనర్లకు రొటీన్‌గా అందాల్సిన చెల్లింపులను, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను కూడా

..మిగతా 2లో



## ఇందిరమ్మ రాజ్యంలో
# ప్రాణాలకు విలువ లేదు

**ఒక పక్క ప్రమాదం జరిగితే...**

**ఎన్నికల ప్రచారానికి సీఎం రేవంత్ : కేటీఆర్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ప్రభాత ఉదయం):** ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు, కూలీల ప్రాణాలకు విలువ లేదని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టు.. ఎనిమిది మందిని బలిపీఠం ఎక్కించి, గ్రాడ్యుయేట్స్‌కు గాలం వేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని కేటీఆర్ విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ

..మిగతా 2లో




# పెండింగ్ పనులను చేపట్టాలంటు ఆమరణ నిరాహార దీక్ష

కొత్తకోట, ఫిబ్రవరి 24(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో పెండింగ్ పనులను చేపట్టాలని ప్రజల సమస్యల సాధనకై బిజెపి ఆధ్వర్యంలో బిజెపి పార్టీ ఫ్లోర్ లీడర్ కొమ్ము భరత్ భూషణ్ పట్టణ చౌరస్తా గాంధీ విగ్రహం ముందు ఆమరణ నిరాహార దీక్ష ను సోమవారం ప్రారంభించారు. భరత్ బూషణ్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు మాజీ శాసనసభ్యులు రావుల రవీంద్ర నాథ్ రెడ్డి మద్దతు తెలిపారు. భరత్ బుషణ్ కు మద్దతుగా చీర్ల తిరుపతయ్య సాగర్,రాజమౌళి, లక్ష్మన్ లు రిలే దీక్షకు కూర్చున్నారు.

### దీక్ష భగ్నం చేసిన పోలీసులు

బిజెపి పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ భరత్ భూషణ్ చేపట్టిన ఆమరణ దీక్షకు అనుమతి లేదంటూ పోలీసులు దీక్షలో కూర్చున్న నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా కొమ్ము భరత్ భూషణ్ మాట్లాడుతూ... పట్టణంలో పెండింగ్ లో ఉన్న పనులను వెంటనే చేపట్టాలని ప్రజల సమస్యలు తీర్చాలంటూ ఎన్నోసార్లు అధికారులకు నాయకులకు విన్నవించుకున్న పట్టించుకోలేదని అందుకే అమరణ నిరాహార దీక్ష చేపట్టానని తెలిపారు. అధికార పార్టీ నాయకులు పోలీసుల ద్వారా దౌర్జన్యంగా దీక్షను భంగం చేసి అరెస్టు లు,అక్రమ కేసులు పెట్టిన దీక్షను మాత్రం విరమించుకునేదే లేదని భరత్ భూషణ్ చెప్పారు. ఈ కార్యక్రమానికి సంఘీభావంగా పబ్బ నరేందర్ గౌడ్, సబిరెడ్డీ వెంకట్ రెడ్డి, కోటిశ్వర్ రెడ్డి,వనపర్తి శ్రీనివాస్ రెడ్డి,కొమ్ము సురేష్,మొగిలన్న,సతీష్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు.




# భారత్ మాటలే కాదు.. చేతల్లో చూపిస్తున్నాం

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడిన ఆయన.. సదస్సులో పాల్గొన్న వారికి క్షమాపణలు తెలియజేశారు. తాను ఆలస్యంగా రావడానికి గల కారణాన్ని చెప్పారు. 10,12 తరగతి విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్ష ప్రారంభమయ్యే సమయం.. నేను రాజ్‌భవన్ నుంచి బయల్దేరే సమయం ఒకటే. అప్పుడు నేను వస్తే భద్రతా కారణాల దృష్ట్యా ట్రాఫిక్ జామ్ కావొచ్చు. దాంతో విద్యార్థులు ఇబ్బందిపడే అవకాశం ఉంది. అందుకే వారంతా పరీక్షా కేంద్రాలకు వెళ్లిన తర్వాత రాజ్‌భవన్ నుంచి బయల్దేరాలనుకున్నాను. దాంతో 15-20 నిమిషాలు ఆలస్యమైంది. ఇక్కడ మీకు అసౌకర్యం కలిగించినందుకు క్షమాపణలు కోరుతున్నానని మోదీ మాట్లాడారు. భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచం ఆశాభావంతో ఉందని మోదీ అన్నారు. జనాభాపరంగా మధ్యప్రదేశ్ ఐదో అతిపెద్ద రాష్ట్రం. వ్యవసాయం, ఖనిజాల పరంగా ముందువరుసలో ఉంది. రెండు దశాబ్దాలుగా ఈ రాష్ట్రంలో ఎన్నో మార్పులు సంభవించాయి. ఇక్కడ భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం సుపరిపాలనపై దృష్టిసారించింది. 20 సంవత్సరాలకు ముందు ఇక్కడికి రావాలంటే పెట్టుబడిదారులు ఆలోచించేవారు. కానీ ఇప్పుడు పెట్టుబడుల పరంగా ముందువరుసలో ఉంది. అలాగే సౌరశక్తిలో భారత్ సూపర్ పవర్‌గా మారిందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఓ విభాగం కీర్తించింది. ఇతర దేశాలు మాటలతో ఆగిపోతుంటే.. భారత్ చెప్పింది చేసి చూపించిందని ఆ సంస్థ పేర్కొంది. ఈ వ్యాఖ్యలు పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. మంగళవారం కూడా ఈ సమ్మిట్ జరగనుంది. దీనికి 60 దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ఆయా దేశాల దౌత్యవేత్తలు పాల్గొన్నారు. భారత వ్యాపారరంగ ప్రముఖులు కుమార్ మంగళంబిర్లా, గౌతమ్ అదానీ, నాదిర్ గోద్రెజ్ తదితరులు హాజరయ్యారు.

# 8 మందిని గుర్తించే ప్రక్రియ వేగవంతం

మొదటి పేజీ తరువాయి...



టన్నెల్ బోరింగ్ మెషిన్ తో వర్క్ చేస్తుంటే ఒక్కసారిగా మూడు మీటర్ల మేర పైకప్పు కూలిపోవడంతో విషాదం నెలకొంది. ఆ సమయంలో దాదాపు 50 మంది ఉండగా.. బోరింగ్ మెషీన్ అవతల వైపున ఉన్న అధికారులు, కార్మికులు మొత్తం 42 మంది రెండు, మూడు కిలోమీటర్లు వరకు పరిగెత్తి.. అక్కడి నుంచి లోకో ట్రైన్ ద్వారా ప్రయాణించి సొరంగం ఎంట్రీ పాయింట్ కు చేరుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. టన్నెల్ బోరింగ్ మెషిన్ లోపలి వైపున ఉన్న ప్రాజెక్టు ఇంజినీర్లు, కార్మికులు కలిసి మొత్తం 8 మంది టన్నెల్ లోపల చిక్కుకుపోయారు. వారిని బయటకు తెచ్చేందుకు మొత్తం 9 టీమ్స్ రంగంలోకి దిగాయి. అటు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ తో పాటు నేవీ, ఆర్మీ ఇతర సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. టన్నెల్ లోపల బురద, నీరు పేరుకుపోయిన పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ర్యాట్ హోల్స్ మైనర్స్‌ను రంగంలోకి దింపనుంది. వాస్తవానికి ర్యాట్ హోల్ మైనింగ్ అనేది ప్రమాదకరమైన విధానం కాగా, ఏం చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఆ విధానానికి మొగ్గు చూపింది. బొగ్గు గనుల నుండి బొగ్గును వెలికి తీయడంలో ర్యాట్ హోల్ మైనింగ్ టెక్నిక్ వినియోగిస్తారని తెలిసిందే. ర్యాట్ హోల్ టెక్నిక్ ద్వారా బొగ్గు గనుల్లో సన్నని, సమాంతర మార్గం ఏర్పాటు చేసి.. బొగ్గు వరకు చేరుకుని దాన్ని బయటకు తీసేందుకు గుంతలను తవ్వుతారు. ఈ విధానంలో సమస్య ఏంటంటే.. ఆ గుంతలు 4 అడుగుల వెడల్పు ఉండటంతో, ఒకసారి ఒక వ్యక్తి మాత్రమే అందులో నుంచి వెళ్లడానికి సాధ్యపడుతుంది. కార్మికులు గనులలోకి ప్రత్యేక పనిముట్లతో, నిచ్చెనల సాయంతో, మరింత సురక్షితంగా లోపలికి ప్రవేశించి జాగ్రత్తగా పనులు చేపడుతుంటారు. శ్రీశైలం కొండను తవ్వుతున్న బోరింగ్ మెషీన్ అటూఇటూగా ఇలాగే ఉంటుంది. %ూాదీజ% భూగర్భాన్ని తొలిచేస్తూ, టన్నెల్‌ను నిర్మించడంలో బాహుబలి వంటి ఈ బోరింగ్ మెషీనే కీలకం. శ్రీశైలం దగ్గర దోమలపెంటలో ఉన్న %ూాదీజ% టన్నెల్ నిర్మాణానికి వాడుతున్న అర్ధచంద్రాకారంలో ఉన్న సిమెంట్ దిమ్మెలు ఇవే. వీటిని ఉపయోగించి సొరంగాన్ని వృత్తాకారంగా ఇలా పకడ్బందీగా నిర్మిస్తున్నారు. 10 మీటర్ల వ్యాసంతో ఉన్న టన్నెల్ నిర్మించాలంటే, ఈ కొండల్లోని శిలలను తవ్వాలి. ఇది మనుషులు చేసే పనికాదు. భారీ యంత్రాలను ఉపయోగించి తవ్వాలి. అయితే ఇవి మార్కెట్లలో లభించేవి కావు. తవ్వాల్సిన టన్నెల్ కోసం, అక్కడి భూమి, శిలలు వంటి భౌగోళిక స్వరూపానికి తగ్గట్లుగా టన్నెల్ బోరింగ్ మెషీన్‌ను ప్రత్యేకంగా తయారు చేయాల్సి ఉంటుంది. బోరింగ్ మెషీన్ ఇలా భారీ పైప్‌లా ఉంటుంది. ఇది కొండను తొలుస్తుంది. అతి భారీ నిర్మాణంతో ప్రత్యేకంగా రూపొందించిన ఈ బోరింగ్ మెషీన్ ముందున్న బ్లేడ్స్- బండరాళ్లు, మట్టిన తొలుచుకుంటూ ముందుకు వెళుతుంది.

ప్రస్తుతం %ూాదీజ% ఇన్‌లెట్ పాయింట్ నుంచి 14 కిలోమీటర్ల వరకు ఇలాంటి యంత్రమే తవ్వింది. ఈ బోరింగ్ మెషీన్ కొండను తొలుస్తున్న సమయంలో వచ్చే మట్టిపెళ్లలు, బండరాళ్లను ఇలాంటి కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలిస్తారు. మట్టిని బయటకు పంపించిన తర్వాత, టన్నెల్‌ని నిర్మించడానికి ప్రత్యేకంగా సిమెంట్ బ్లాక్స్‌ను తయారుచేస్తారు. ఆ సిమెంట్ బ్లాక్స్‌ను ఇలా టన్నెల్‌కు కవచంగా ఫిట్ చేస్తారు. తద్వారా భూ ఉపరితలం నుంచి వచ్చే ఒత్తిడిని ఈ సిమెంట్ బ్లాక్స్ తట్టుకునేలా నిర్మాణం సాగుతుంది. అలాగే భూమి పొరల నుంచి లీక్ అయ్యే నీటిని ఇవి అరికడతాయి. నీటి ఊట వల్ల ఈ సొరంగం దెబ్బతినకుండా ఈ సిమెంట్ బ్లాక్స్ రక్షణ కవచంగా నిలుస్తాయి. కాగా.. శ్రీశైలం లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ టన్నెల్ తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ఉంది. ఈ కెనాల్ పూర్తయితే నల్గొండ జిల్లాకు సాగు నీరు అందించవచ్చు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను కెనాల్ ద్వారా మళ్లించి నల్గొండకు తాగునీరు అందించడం ద్వారా ఆ జిల్లాలో నెలకొన్న ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించాలనేది ఆలోచన. ఈ ప్రాజెక్టు ప్రారంభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి. 2004లో 1925 కోట్ల అంచనాతో శ్రీకారం చుట్టగా 2007లో పనులు ప్రారంభమయ్యాయి. షెడ్యూల్ ప్రకారం నాలుగేళ్లలో పూర్తి కావల్సి ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా 4.15 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. 516 గ్రామాలకు సురక్షిత మంచి నీరు లభిస్తుంది. వాస్తవానికి నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి కావల్సి ఉంది. ఈ ప్రాజెక్టులో కీలకమైంది 43.93 కిలోమీటర్ల సుదీర్ఘమైన టన్నెల్ మార్గం. ఇదే అత్యంత ముఖ్యమైంది. టన్నెల్ బోరింగ్ మిషన్ నిర్మాణ సంస్థ పనులు చేపట్టింది. 2 చోట్ల సొరంగాలు, హెడ్ రెగ్యులేటర్, రెండు లింక్ కెనాల్స్, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఉన్నాయి. ఇప్పటి వరకూ శ్రీశైలం జలాశయం ఇన్‌లెట్ నుంచి 13.93 కిలోమీటర్లు పనులు పూర్తి కాగా అటు నుంచి అంటే మన్నెవారి పల్లె నుంచి 20.43 కిలోమీటర్లు పూర్తయింది. మధ్యలో 9.55 కిలోమీటర్ల టన్నెల్ తవ్వాల్సి ఉంటుంది. మధ్యలో మిషన్ సాంకేతిక సమస్యలతో కొద్దికాలం ఆగిపోయింది. 2019లో భారీ వర్షాలు, వరదల కారణంగా ఇన్‌లెట్ టన్నెల్‌లో పెద్దఎత్తున నీళ్లు రావడంతో మరోసారి ఆగిపోయాయి. భౌగోళిక కారణలు, మెషిన్ చెడిపోవడంతో పనులు ముందుకు సాగలేదు. తాజాగా ఈ పనులు మరోసారి ప్రారంభమయ్యాయి. చెడిపోయిన మిషన్ బేరింగులను అమెరికా నుంచి కొనుగోలు చేసి ప్రత్యేక నౌక ద్వారా ఇండియాకు రప్పించారు. చెన్నై పోర్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా %ూాదీజ% ప్రాంతానికి చేర్చాల్సి ఉంది. ఈ క్రమంలో రెండు వైపులా తవ్వకాలు పునరుద్ధరించేందుకు ఏర్పాట్లు జరుగుతుండగా పైకప్పు కూలిపోయింది. ప్రాజెక్టు ప్రస్తుతం అంచనా వ్యయం 4,637 కోట్లు కాగా ఇప్పటి వరకూ 2,689 కోట్ల పనులు పూర్తయ్యాయి. 2026 నాటికి పూర్తవుతుందని అంచనా ఉంది. భౌగోళిక, సాంకేతిక కారణాలతో ఈ ప్రాజెక్టు నిరంతరం ఆలస్యం అవుతూనే ఉంది.

# హైదరాబాద్ మెట్రో విస్తరణకు అడ్డుపుల్ల

మొదటి పేజీ తరువాయి...

ఉన్నప్పటికీ సొంత నిధులతోనైనా ముందుకు సాగేందుకు విశ్వప్రయత్నాలు చేసింది. అయితే భూసేకరణతోపాటు మెట్రో విస్తరణకు అవసరమైన వేలకోట్ల రూపాయలు నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారాయి. అందులోనూ ఉచిత బస్సు, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మెట్రోను విస్తరించడం భారంగా మారింది. ఈ నేపథ్యంలో కేంద్రంపై ఆధారపడక తప్పలేదు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి . కిషన్ రెడ్డిపై చేసినవి ఆరోపణలు కాదని, తనకు బీజేపీ మంత్రులతో పరిచాయాలున్నాయని, వాళ్లే చెప్పారని రేవంత్ అనడం మాట్లడటం రాజకీయ దుమారం రేపుతోంది.నిధులు విడుదల చేసి, మెట్రో విస్తరణకు సహకరిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పేరు వస్తుందే కానీ, బీజేపీకి రాదు అని కిషన్ రెడ్డి చెప్పారని రేవంత్ రెడ్డి అన్నారు. మెట్రో ముందుకు వెళ్లకుండా ఆపుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ అభివృద్ధి చెందడం కిషన్ రెడ్డికి ఇష్టం లేదంటూనే తీవ్ర స్థాయిలో విమర్శించారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టు విషయంలో కేంద్రం నుంచి ఏమాత్రం సహకారం రాకపోవడానికి ప్రధాన కారణం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డేనని ఆరోపించారు రేవంత్. యూపిలో గంగా, గుజరజాత్‌లో సబర్మతి, ఢిల్లో యమున ఇలా అనేక నదులు ప్రక్షాళన చేసిన కేంద్రానికి అదే హైదరాబాద్‌లో మూసి ప్రక్షాళన ఎందుకు కనిపించడలేదన్నారు. మూసీ సుందరీకరణకు కేంద్రం నుంచి నిధులు రాకుండా, పర్యావరణ అనుమతులు ఇవ్వకుండా కావాలనే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పాలమూరు ఎత్తిపోతల పథకంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు కేంద్రం సహకారం లేకుండా నిలిచిపోతున్నాయంటే దానికి ప్రధాన కారణం కిషన్ రెడ్డి మాత్రమేనని రేవంత్ ఆరోపించారు. సిఎం హొదాలో ఉండి ఓ కేంద్రమంత్రిపై అందులోనూ ఇదే రాష్ట్రానికి చెందిన సినీయర్ బిజెపి నేతపై చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. హైదరాబాద్‌లో మూసీ పరివాహక ప్రాంత ఓటర్ల ఓట్లతో గెలిచిన కిషన్ రెడ్డి అదే మూసీ అభివృద్ధిని ఎందుకు ఓర్వలేకపోతున్నారని నిప్పులు చెరిగారు రేవంత్. కేవలం ఆరోపణలు చేయడమే కాదు, అదే పార్టీకి చెందిన మంత్రులు చెప్పారని అనడం మరింత అగ్గి రాజేసింది.

# కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చేందుకు కుట్రలు

మొదటి పేజీ తరువాయి...

ఇస్తున్నామన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ 8 వేల కోట్లు బకాయి పెట్టారని.. రాబోయే రోజుల్లో నెలకు వెయ్యి కోట్ల చొప్పున చెల్లిస్తామని ప్రకటించారు. 'బండి సంజయ్ బడా బీసీ అంటున్నాడు. మీరు పదేళ్ళలో కులగణన ఎందుకు చేయలేదు. మీకోసం లెక్కలు తేల్చి నేను కొట్లాడుతున్నా. బలహీన వర్గాల లెక్కలు తప్పైతే ఆధారాలతో చూపండి. సొల్లు మాటలు వద్దు. గుజరాత్‌లో 29 కులాల ముస్లింలు బీసీ రిజర్వేషన్లు అనుభవిస్తున్నారు. మాదిగ ఉప కులాల వర్గీకరణ చేసి చట్టసభల్లో ఆమోదించాం. మోదీ, కృష్ణ మాదిగను కౌగిలించుకున్నాడు కానీ వర్గీకరణ చేయలద న్నారు. జర్నలిస్టుల సమస్యలు పట్టించుకుని పరిష్కరిస్తు న్నామని తెలిపారు. టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు అరెస్ట్ కాకుండా అడ్డుకుంటుంది బండి సంజయ్, కిషన్ రెడ్డి. ఈ కార్ రేసులో కేటీఆర్‌ను ఈడీ ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు.మూసీ ప్రక్షాళనకు నిధులు రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. పట్టభద్రులు అండగా నిలబడండి.. కేంద్రంతో కొట్లాడి నిధులు తెస్తా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దూరదృష్టి ఉన్న నాయకుడు రేవంత్ రెడ్డి అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. పట్టభద్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ ధైర్యంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. 9 మాసాల్లో 56 వేల ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. బీజేపీ కేంద్ర మంత్రులు కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తెచ్చింది సున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. పట్టభద్రులు ఆలోచించి ఓట్లు వేయాలని మహేష్ కుమార్ కోరారు.

# ఇందిరమ్మ రాజ్యంలో ప్రాణాలకు విలువ లేదు

మొదటి పేజీ తరువాయి...

టన్నెల్ కుప్పకూలి ఎనిమిది మంది ఆచూకీ తెలియని ఈ విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మునిగితేలడం దిగజారుడు రాజకీయమేనని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రికే జరిగిన ఘోర దుర్ఘటనపై సీరియస్‌నెస్ లేకపోతే, ఇక అధికార యంత్రాంగానికి ఎక్కడ ఉంటది, రెస్క్యూ ఆపరేషన్ ఎలా ముందుకు సాగుతదని ప్రశ్నించారు. ఓట్ల వేటలో జిల్లాలకు జిల్లాలు చుట్టి వచ్చేందుకు ముఖ్యమంత్రికి సమయం ఉంది కానీ.. ఒక్కసారి క్షతగాత్రుల ఆర్థనాదాలతో మిన్నంటుతున్న ఎస్ఎల్బీసీ టన్నెల్‌కు వెళ్లే టైమ్ లేదా అని నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ప్రాణాలకు ఇచ్చే విలువ ఇదేనా అంటూ ధ్వజమెత్తారు. ప్రజాపాలన అంటే నోట్ల వేట.. ఓట్ల వేట మాత్రమేనా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓవైపు సహాయక చర్యలు కొలిక్కి రాకముందే, ఇరుక్కున వారు బతికుండే అవకాశం కనిపించడం లేదని సర్కారు చేతులెత్తేస్తున్న తీరు, మరోవైపు సహాయక చర్యలను పర్యవేక్షించి, బాధితుల కుటుంబాలకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత మరిచి ఎన్నికలే మా తొలి ఎజెండా అనే ముఖ్యమంత్రి, సర్కారుకు కనీస మానవత్వం కూడా లేదా అన్నారు. రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టు, ఎనిమిది మందిని బలిపీఠం ఎక్కించి గ్రాడ్యుయేట్స్ కు గాలం వేసేందుకు సిద్ధమైన సీఎంను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. సరైన సమయంలో కాంగ్రెస్‌కు కర్రుగాల్చి వాత పెడ్తారని ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మానసిక క్షోభలో రాష్ట్ర ఉద్యోగులు

మొదటి పేజీ తరువాయి...

చెల్లించకుండా జాప్యం చేస్తూ వారిని తీవ్రమైన మానసిక ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమని ఆయన లేఖలో పేర్కొన్నారు. పెండింగ్ డీఏలు, జీపీఎఫ్ బకాయిలు, మెడికల్ బిల్లులు, గ్రాట్యుటీ పెన్షన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పేరుతో ఉద్యోగులు, పెన్షనర్లకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించడమనేది ప్రభుత్వ పాలనలో రోటీన్‌గా జరిగే వ్యవహారమన్నారు. కానీ వాటిని కూడా మీరు చెల్లించకపోవడంవల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.8,200 కోట్లు బకాయి పడ్డారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పట్ల మీరు అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని, ప్రభుత్వాన్ని నమ్ముకుని నిజాయితీగా పనిచేసే ఉద్యోగుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో, వారికి మీరు ఏ సందేశం ఇవ్వదలచుకున్నారో ఒక్కసారి ఆలోచించండన్నారు. అంతేకాకుండా..'ఇంకా బాధాకరమైన విషయమేమిటంటే గత ఏడాది 2024లో 8 వేల మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. ఈ ఏడాది మరో 10వేల మంది రిటైర్ కాబోతున్నరు. వారికి పదవీవిరమణకు సంబంధించిన ప్రయోజనాలను రూ.11 వేల కోట్ల రూపాయలు చెల్లించాలి. నేటి వరకు ఒక్కరికి కూడా చిల్లిగవ్వ కూడా ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసం అని అన్నారు. జీతం పైసల నుండి సొంతంగా జీపీఎఫ్‌లో దాచుకున్న సొమ్మును కూడా చెల్లించక పోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిత్యం మంత్రుల పేషీల చుట్టూ, అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. దశాబ్దాల తరబడి ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులకు మీరిచ్చే ప్రతిఫలం ఇదేనా? ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో మీరు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపూరిత విధానంతో తీరుతో లక్షలాది విద్యార్థులు, వందలాది మంది కళాశాలల యాజమాన్యాలు మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. రాష్ట్రంలో ఇంటర్ నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ వంటి కోర్సులను చదువుతున్న దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారు. కానీ గత బీఆర్ఎస్ పాలకులు గానీ, ప్రస్తుతమున్న మీ ప్రభుత్వం కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడంవల్ల దాదాపు రూ.7,500 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి. బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యం కారణంగా కాలేజీల నిర్వహణ భారమై రాష్ట్రవ్యాప్తంగా వందలాది కాలేజీలు మూసివేతకు సిద్దంగా ఉన్నాయి. ఇప్పటికే పదుల



సంఖ్యలో కాలేజీలు మూతపడ్డాయి. 90? కాలేజీ యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు సకాలంలో ఇవ్వలేని కారణంగా కాలేజీల సిబ్బంది ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పులు పెరగడంతో ఆయా కాలేజీల నిర్వహణ కూడా భారంగా మారింది. సరైన వేతనాలు చెల్లించలేకపోవడంతో..విద్యా ప్రమాణాలు కూడా దెబ్బతింటున్నాయి. ఇది రాష్ట్ర విద్యావ్యవస్థకే పెనుసవాల్‌గా మారే పరిస్థితులను సృష్టిస్తోంది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సంవత్సరాల తరబడి చెల్లించకపోవడంతో తమ కాలేజీలు నడవాలంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ భారాన్ని విద్యార్థులే మోయాలని, లేనిపక్షంలో సర్టిఫికెట్లు ఇవ్వబోమని యాజమాన్యాలు తెగేసి చెబుతుండటంవల్ల సామాన్య, బడుగు బలహీనవర్గాల విద్యార్థులు అనేక మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్ని విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బిల్లుల్లో సుమారు రూ.380 కోట్ల మేరకు చెల్లిస్తామని గత ఏడాది నవంబరులో టోకెన్లను జారీ చేసినా.. ఇంతవరకు ఎటువంటి చెల్లింపులు జరపకుండా కాలేజీ యాజమాన్యాలను పాలకపార్టీ నాయకులు చుట్టూ తిప్పుకుంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను క్లియర్ చేస్తామని మీరు హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు మీరు మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసింది. మీ సభలకు పెద్దమొత్తంలో తరలిరావాలని, కళాశాలలు మూసేసి.. సిబ్బందిని తీసుకురావాలని, లేకుంటే ఇబ్బంది పడతారని ఆయా జిల్లాల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కాలేజీ యాజమాన్యాలను బెదిరిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. మీ ప్రభుత్వ అసమర్థత కారణంగా ఇప్పటికే తీవ్రమైన మానసిక క్షోభను అనుభవిస్తున్న కాలేజీ యాజమాన్యాలు.. ఇప్పుడు మీ కార్యక్రమం కోసం బెదిరింపులు ఎదుర్కొంటుండటం దురదృష్టకరం అన్నారు.

ఇది కాకుండా.. ఏప్రిల్, మే నెలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని మీరు కాలేజీ యాజమన్యాలను మళ్లీ మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ పార్టీ గట్టెక్కడానికే.. మీరు ఇలాంటి చర్యలకు పూనుకోవడం ముఖ్యమంత్రి పదవికి ఏ మాత్రం శోభను ఇవ్వదని గుర్తుంచుకోవాలి. మీ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా యుద్ధ ప్రాతిపదికన తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా విడుదల చేయాలి. అదే విధంగా.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు చెల్లించాల్సిన పెండింగ్ డీఏలు, జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఖఖీఅ బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలి. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ మొత్తాన్ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాను.' అని కిషన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి ఆశ చూపి 14 నెలలుగా ఒక్కొక్కరికి రూ.56 వేలు బకాయిపడి యువతను దగా చేశారు. ఏమాత్రం నిజాయతీ ఉన్నా యుద్ధ ప్రాతిపదికన ఆ బకాయిలు విడుదల చేయాలి. నేడే రూ.7,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును కాలేజీ యాజమాన్యాల ఖాతాల్లో జమ చేయాలి. ఇవన్నీ విడుదల చేసిన తర్వాతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడగాలని కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

## ఈ నెల 25 నుంచి రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో

# మహా శివరాత్రి వేడుకలు

బుద్వేల్, ఫిబ్రవరి24(ప్రభాత ఉదయం): అత్తాపూర్ రాం బాగ్ లో గల చిన్న అనంతగిరి శివాలయంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మహా శివరాత్రి వేడుకలను నిర్వహించడానికి ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పురాతన దేవాలయాన్ని 500ల సం వత్సరాల క్రితం అక్కన్న మాదన్నలు ద్వారా నిర్మించబడిందని పెద్దలు చెప్పుకుంటారు. ఇక్కడ మహా మునీంద్రులు ధ్యానం చేసేవారని దేవాలయ చరిత్ర, స్థల పురాణం చెబుతుంది. భక్తుల కోర్కెలు తీర్చే ఉమా మహేశ్వరుడు ఇక్కడ కొలువుదీరాడు. శివుడి గర్భగుడికి ఎదురుగా ధ్వజ స్తంబముకు బదులుగా శ్రీ ఆంజనేయ స్వామీ దేవాలయం ఉంది. ఇలా ఒకటి రామేశ్వరంలో జ్యోతిర్లింగానికి ఎదురుగా ఉందని చెప్పుకుంటారు. రెండవది రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలోనే ఉంది. ఈ పురాతన దేవాలయం శ్రీ యంత్రరూపంలో గోపురము నిర్మించబడి ఉంది. ఈ దేవాలయాన్ని దర్శించుకున్న భక్తులకు రామేశ్వరంలో జ్యోతిర్లింగాన్ని దర్శించుకున్నంత పుణ్యం లభిస్తుందని భక్తులు నమ్ముతారు. ఈ దేవాలయం ఆవరణలో రాధాక్రిష్ణ గోశాల కూడా ఉంది.



రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో కొలువు దీరిన బోళా శంకరుడు



శివాలయంలో సమావేశమైన ప్రణవ భక్త సమాజం సభ్యులు

**పూజా కార్యక్రమాలు :**

మహా శివరాత్రి పండుగ ను పురస్కరించుకుని ఈ నెల 25న ఉదయం 4గంటలకు సుప్రభాత సేవ, గణపతి,అమ్మవారికి, స్వామీ వారికి అభిషేకాలు పూజలు జరుగుతాయని ప్రణవభక్త సమాజం అధ్యక్షులు మోంగ్ర నర్సింహ్మా, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, ఉపాధ్యక్షులు సనివెళ్లి క్రిష్ణ, బర్ల మల్లారెడ్డి, కోశాధికారి ఎస్బీ హరినాథ్, కార్యదర్శి కొండమీది హరినాధ్, ముఖ్య సలహదారులు నారగూడెం మల్లారెడ్డి, మోంగ్ర కొమురయ్య, మ్యాడం మదు సూదన్ ప్రచార కార్యదర్శులు షాబాద విజయ్ కుమార్, మోంగ్ర ఐలయ్య, కార్యవర్గ సభ్యులు ఎస్.జయానంద్ రెడ్డి, ఎం.బాలు, శ్రీకాంత్, పెంటల సుధాకర్ రెడ్డి, మ్యాడం రాము, సోమారం సురేశ్, ఎల్.వెంకటేశ్, షాబాద ఆనంద్, రావుల గండయ్య, రావుల జగన్, ఎం.రాజు, కె.ప్రసాద్, ఇ.సహదేవరెడ్డి, ఎస్.రమేశ్, బి.దయాకర్, గురు ప్రీత్ సింగ్ లు తెలిపారు. 26వ తేదీన పూజా కార్యక్రమాలతో పాటు శ్రీ దివ్యజ్యోతి జాగృతి సం స్థాన్ వారిచే భక్తి ప్రవచనాలు ఉంటాయన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ కు చెందిన రవిశంకర్ గురుజీ సంస్థ సభ్యులతో సత్సంగ్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాత్రి 12:30 గంటలకు శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. 27వ తేదీన ఉమా మహేశ్వర స్వామీ వార్లకు పుష్పాలంకరణ కార్యక్రమం, అన్నదాన కార్యక్రమాలు ఉంటా యన్నారు.



రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ బద్రినారాయణకు వినతి పత్రం అందచేస్తున్న క్రాంతి వర్మ

## రూట్ బస్సులను నడపాలి

బుద్వేల్, ఫిబ్రవరి24(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో పరిధిలో రూట్ బస్సులను ఏర్పాటు చేయాలని కోరుతు సోమవారం కామన్ ప్లాట్ ఫారమ్ ప్రధాన కార్యదర్శి క్రాంతి వర్మ బస్సు డిపో మేనేజరు బద్రి నారాయణ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, బవానీ కాలనీ, శివరాంపల్లి, బుద్వేల్, ఉప్పర్ పల్లి, హనుమాన్ నగర్, ఏవీఎస్ రెడ్డి కాలనీ తదితర బస్తీలలో నివాసం ఉండే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే వారికి బస్సు సౌకర్యం సరిగ్గా లేదన్నారు. డిపో అధికారులు సర్వే చేసి బస్తీలలోకి రూట్ బస్సులను నడపాలని కోరారు. ప్రధాన రహదారిలో బస్సు దిగి బస్తీలలోకి నడుచుకుంటు వెళుతున్న సందర్భంగా చైన్ స్నాచింగ్ లు జరుగుతున్నాయన్నారు. అందుకే దూరంగా ఉన్న కాలనీలలో నివాసం ఉండే ప్రజల సౌకర్యార్థం రూట్ బస్సులను నడపాలన్నారు.



## ఘనంగా మూల సంతోష్ గౌడ్, వందన దంపతుల 25వ వివాహ దినోత్సవ వేడుకలు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 24(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ కు చెందిన మూల సంతోష్ గౌడ్, వందన దంపతుల 25వ వివాహ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం సంతోష్ గౌడ్ స్నేహితులు, కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించి సంతోష్ గౌడ్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సంతోష్ గౌడ్ కు బుద్వేల్ కు చెందిన కే శ్రీనివాస్ గౌడ్, రమేష్ గౌడ్, ఎస్.కె నజీర్, మూల నిరంజన్ గౌడ్, జి కిరణ్ గౌడ్, రంటయ్య చారి, నరేష్ కుమార్, మల్లేష్ యాదవ్, ఎం నాగరాజు, ఎం రమేష్ నాయిని లు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు



చిన్న అనంతగిరి శివాలయం వద్ద శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో ప్రణవభక్త సమాజం ప్రతినిధులు

## గోల్డెన్ జూబ్లీ మహాశివరాత్రి

### మహాశివరాత్రి స్వర్ణ ఉత్సవాలు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 24(ప్రభాత ఉదయం) ఆత్తాపూర్ డివిజన్ పరిధిలోని చారిత్రక చిన్న అనంతగిరి శివాలయంలో మంగళవారం నుంచి 50వ మహాశివరాత్రి ఉత్సవాలు కనుల పండుగ జరగనున్నాయి. ఇందుకోసం గతంలో కనివిని ఎరుగని రీతిలో భారీ ఏర్పాటు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం 6 గంటలకు గణపతి హెూమం తో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. బుధవారం శివరాత్రి ఉత్సవం సందర్భంగా భజనలు కీర్తనలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున ఉంటాయని హైదర్ గూడ ప్రణవభక్త సమాజం అధ్యక్షులు మొంగ్ర నరసింహ వెల్లడించారు. గురువారం జరిగే మహా అన్నదాన కార్యక్రమంలో దాదాపు 20,000 మందికి పైగా పాల్గొంటారని ఆయన తెలిపారు. శివాలయంలో గత 50 సంవత్సరాల నుంచి ప్రతి శివరాత్రి అన్నదాన కార్యక్రమం నిరాటంగా జరుగుతుందని,ఈ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని భక్త సమాజం బాధ్యులు సనివెల్లి కృష్ణ, పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి , ఆ కొండమీది హరి, రావుల గంగయ్య, ఎస్బిఐ హరినాథ్ ,వివరించారు. ఈ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సలహాదారు లు ఎన్ మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## నేడు మైలార్దేవ్ పల్లి, హిమాయత్ సాగర్, శంషాబాద్‌లలో విద్యుత్ సరఫరా లో అంతరాయం



రాజేంద్రనగర్/బండ్లగూడ/శంషాబాద్, ఫిబ్రవరి 24(ప్రభాత ఉదయం) మైలార్ దేవుపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో గ్రీన్ విచ్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరు శ్రీనివాస్ తెలిపారు. ఎండి పల్లి, బృందావన్ కాలనీ, పల్లె చెరువు, బండ్లగూడ, బి.కె.పురం, అబ్దుల్లా కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శుభాన్ కాలనీ ఫేస్ 1,2, మిలాన్ కాలనీ, రహమత్ కాలనీ కొంత భాగం, రాజీవ్ గాంధీ నగర్, పటేల్ నగర్, రహమత్ కాలనీ, అబ్దుల్లా కాలనీ, కింగ్స్ ఎవెన్యూ, అలీ నగర్, పల్లె చెరువు, మొగల్ కాలనీ, ప్రగతి కాలనీ, టాటా నగర్, తమిళ్ బస్తి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**హిమాయత్ సాగర్ లో...**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో మంగళవారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హైదర్ షాకోట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన తిరుమలా గార్డెన్, బండ్లగూడ గ్రామం, శివాలయం గుడి, ఆర్మీ పద్మశ్రీ హిల్స్, మాపిల్ టౌన్-2, పావని హార్మోన్స్, సాయి శక్తి, ప్రశాంత్ నగర్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు.

**శంషాబాద్ లో...**

శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు వివిధ విద్యుత్తు పనుల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు. సీఎస్కే కాలనీ, రాఘవేంద్ర కాలనీ, శ్రీ బాలాజీ టౌన్ షిప్, రాళ్లగూడ, ప్రకాష్ నగర్, యాదవ్స్ కాలనీ, పోర్ట్ గ్రాండ్, శ్రీనివాస కాలనీ, ఆదర్శనగర్, రిజిస్ట్రేషన్ ఆఫీస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



## ఘనంగా గణేష్ నాయక్ 25వ వివాహ వార్షికోత్సవం

శంషాబాద్, ఫిబ్రవరి 24(ప్రభాత ఉదయం) శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేష్ నాయక్ 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బంధుమిత్రుల సమక్షంలో జరిగిన వివాహ వార్షికోత్సవ వేడుకలకు శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ యాదవ్. ఉపాధ్యక్షుడు కోటేష్ గౌడ్. స్థానిక నాయకులు సురేష్ గౌడ్. ఎండి గౌస్. ప్రమోద్. భాస్కర్ గౌడ్ శీను నాయక్ తదితరులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.




## ప్రజావాణికి 22 ఫిర్యాదులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 24 (ప్రభాత ఉదయం) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 22 ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ,నర్సింగరావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా,అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,ప్రజల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలి

బుద్వేల్, ఫిబ్రవరి 24 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ ఎన్ఐఆర్ డీ పీఆర్ చౌరస్తా వద్ద రోడ్డు పనులు జరుగుతున్న సందర్భంగా ప్రతి రోజు ఉదయం. సాయంత్రం వేళలలో ట్రాఫిక్ పోలీసులను నియమించి ట్రాఫిక్ స్థంబించకుండ చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వివిధ పాఠశాలల నిర్వాహకులు కోరుతున్నారు. సాధారణంగానే అంబేద్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ స్థంబించి పోతుంటుందని, రోడ్డు వేయడం వల్ల సమస్య మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. ఉదయం పాఠశాలలకు విద్యార్థులు వెళ్లే సమయంలో, సాయంత్రం స్కూల్ ను వదిలే సమయంలో తప్పని సరిగా ట్రాఫిక్ కానిస్టేబుల్ ను నియమించాలని కోరారు.



రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో జరుగుతున్న రోడ్డు పనులు



రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్

## లంచం తీసుకుంటు పట్టుబడ్డ రాజేంద్రనగర్ సర్కిల్ బిల్ కలెక్టర్, అతని అసిస్టెంట్

బుద్వేల్, ఫిబ్రవరి24( ప్రభాత ఉదయం) : ఓ పరిశ్రమ యమజాని నుంచి తన సహాయకుని ద్వారా రూ.45వేలు లంచం తీసుకున్న రాజేంద్రనగర్ సర్కిల్ బిల్ కలెక్టర్ తో పాటు అతని సహాయకుణ్ణి సోమవారం రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ బృందంలోని అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి....
మైలార్దేవుపల్లి డివిజన్ పరిధిలోని ఓ పరిశ్రమకు సంబంధించి ఆస్తి పన్ను ను పెంచకుండ ఉంటాలంటే లక్ష రూపాయలు లంచంగా ఇవ్వాలని బిల్ కలెక్టర్ సి.మధు, అతని అసిస్టెంట్ వి.రమేశ్ లు డిమాండ్ చేశారు. దానికి సదరు పరిశ్రమ యజమాని రూ.45వేలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. అట్టి డబ్బులను సోమవారం మైలార్దేవుపల్లి వార్డు కార్యాలయం వద్దకు వచ్చిన ఫ్యాక్టరి యమజాని బిల్ కలెక్టర్ సహాయకుడు వి.రమేశ్ కు ఇచ్చాడు. వెంటనే ఏసీబీ అధికారులు దాడులు చేసి అ డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. బిల్ కలెక్టర్ సి.మదు. అసిస్టెంట్ వి.రమేశ్ లు కలసి లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారుల విచారణ లో తేలింది. దీంతో ఇద్దరిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి నాంపల్లి అడిషనల్ స్పెషల్ జడ్జి ముందు హాజరు పరిచారు.

**గడిచిన 8 నెలలో ముగ్గురు అధికారులు**

రాజేంద్రనగర్ సర్కిల్ కు సంబందించి గడిచిన 8 మాసాలలో లంచం తీసుకుంటున్న ముగ్గురు అధికారులను ఒక అసిస్టెంట్ ను ఏసీబీ అధికారులు పట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. 2024 జూలై నెలలో రాజేంద్రనగర్ సర్కిల్ లో ఏఈ గా పనిచేస్తున్న బల్వంత్ రెడ్డి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పటుకున్నారు. అదే సంవత్సరం అక్టోబరు మాసంలో ఏఈ గా ఓ పనికి సంబంధించి ఓల్డ్ మెజర్మెంట్ చేయడానికి లంచం తీసుకుంటుండగా ఏఈ వెం కోటా ను ఏసీబీ అధికారులు పట్టు కున్నారు. తాజా గా ఫ్యాకరీకి సంబందించి ఆస్తి పన్ను పెం చకుండా ఉండాలంటే లంచం డిమాండ్ చేయడంతో బిల్ కలెక్టర్ సి.మదు, ఆసిస్టెంట్ వి.రమేశ్ ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.



ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న బిల్ కలెక్టర్ సి. మధు, అసిస్టెంట్ వి.రమేష్ లు, స్వాదీనం చేసుకున్న నగదు

**ఎవరైన ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వండి : ఏసీబీ అధికారులు**

ఎవరైన ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ అదికారులు తెలిపారు. లేదా 9440446106 సెంబర్ కు వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

## పత్తికుంట కలుషితం కాకుండ చూడాలి



పత్తి కుంట



పత్తి కుంట కలుషితం కాకుండా చూడాలని డిప్యూటీ కమిషనర్ కె రవికుమార్ కు వినతి పత్రం అందచేస్తున్న వై శ్రీధర్, జి బాబు రావు, ఈ వేణుగోపాల్ లు

### రాజేంద్రనగర్ గణేశ్ ఉత్సవ సమితి

బుద్వేల్, ఫిబ్రవరి24(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ సమీపంలో ఉన్న బిపత్తికుంట చెరువులో కులుషిత నీరు కలున్నున్నాయని, అధికారులు విచారణ చేసి పత్తికుంట కలుషితం కాకుండ చూడాలని కోరుతు రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ కు సోమవారం రాజేంద్రనగర్ గణేశ్ ఉత్సవ సమితి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్ లు మాట్లాడుతూ, పత్తికుంట లో ప్రతి సంవత్సరం వినాయక నిమజ్జనాలు చేయడం జరుగుతుందని. ఈ చెరువులో వర్షం నీరు మాత్రమే ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో హనుమాన్ నగర్, మానస హిల్స్, ఊర్జిత హెూమ్స్ తదితర ప్రాంతాల నుంచి మురుగునీరు వస్తుందన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.



జలమండలి ఎండి అశోక్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 24(ప్రభాత ఉదయం) మల్కాజిగిరి నియోజకవర్గం లో వేసవిలో ప్రజలు నీటి ఎద్దడికి గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జలమండలి యం.డి. అశోక్ రెడ్డిని ఖైరతాబాద్ లోని తన కార్యాలయంలో కలిసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. సోమవారం జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కలిసి వచ్చే ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని కోరారు. నియోజకవర్గం పరిధిలోని మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని ఏడు జే.ఏ.సి కాలనీలలో డ్రేయిన్ ఔట్లేట్ ఏర్పాటుతో పాటు నీటి కనెక్షన్లు ఏర్పాటు చేయాలని, కౌకూర్ జనప్రియ ఆర్కేడ్ లోని 600 ఫ్లాట్లకు మంచినీటి కనెక్షన్లను పునరుద్ధరించాలన్నారు. ఫాదర్ బాలయ్య నాగర్ రిజర్వాయర్లో తరచూ బోర్లు రిపేర్ అవుతున్నాయని, కొత్తవి, మల్కాజిగిరి నియోజకవర్గానికి సరఫరా అయ్యే నీటిని కొంతమేరకు పారిశ్రామిక అవసరాలకు సరఫరా చేయడం మానుకోవాలని,మంచినీటి సరఫరా సమయం పెంచాలని, గౌతం నగర్ వాటర్ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ పునరుద్ధరించాలని, అదే విధంగా మల్కాజిగిరి పరిధిలోని 1300 మంది కన్సుమర్ల మీటర్ కాన్ నెంబర్లు మహీంద్రా హిల్స్ సెక్షన్ కు మార్చాలని కోరారు తద్వారా మంచినీటి సరఫరా కూడా మెరుగ్గా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు, అదే విధంగా నియోజకవర్గ పరిధిలో దాదాపు 70 బోర్లకు మరమత్తులు చేయించాలని, మల్కాజిగిరి డివిజన్ కృపా ఆనంద్ అపార్ట్మెంట్స్ లో రెండు పవర్ బోర్లు వేయించాలని జలమండలి యం.డి. అశోక్ రెడ్డి ని కోరిన ఎమ్మెల్యేకోరారు .ఈ కార్యక్రమంలోకార్పొరేటర్ మేకల సునీత, సీనియర్ నాయకులు బద్దం పరశురామ్ రెడ్డి, జగదీష్ గౌడ్, డోలి రమేష్, అమీనుద్దిన్, లక్ష్మణ్ యాదవ్,శరణగిరి, సందీప్ రెడ్డి గో ఉన్నారు.



అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్ ను విడుదల చేస్తున్న కలెక్టర్ సంతోష్

## ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో ప్రజలను చైతన్య పరచాలి

### జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి24(ప్రభాత ఉదయం)జిల్లాలో ఈనెల 24 నుండి 28 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించి బ్యాంకు లావాదేవీలపై మహిళలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలకు పొదుపు, బ్యాంకులలో అకౌంట్ తెరవడం, బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం తదితర 65 అంశాలపై వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రంలో బ్యాంకర్లు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఎల్ డి ఎం అయ్యప్ప రెడ్డి లతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

### జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి24(ప్రభాత ఉదయం)బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎస్సై లను, సీ.ఐ లను జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 10 మంది బాధితుల ఫిర్యాదులను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలకు సంబందించిన పిర్యాదులు, కొడుకులు తల్లిదండ్రులు లను చూడక పోవడం, అన్నదమ్ముల మధ్య బాగా పరిష్కార పిర్యాదులు, లైంగిక వేధింపులకు సంబంధించిన పిర్యాదులు మరియు భర్త వేదింపులకు సంబంధించిన ఫిర్యాదులను ఎస్పీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్పి వై.మోగిలయ్య పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలి: కలెక్టర్ సంతోష్



గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి24(ప్రభాత ఉదయం) ఆధార్ కార్డు అన్ని సేవలకు కీలకమైనదిగా మారిందని, ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండి, తమ వివరాలు, బయోమెట్రిక్‌ను నవీకరించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ తెలిపారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది.హైదరాబాద్ నుండి వీ.సీ ద్వారా యుఐడిఏఐ డిప్యూటీ డైరెక్టర్ చైతన్య రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు,పౌర సేవలు పొందాలంటే ఆధార్ అప్ డేట్ తప్పనిసరి అని అన్నారు. ఆధార్ ఆధారంగా కొనసాగుతున్న సేవలను భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్డు వివరాలు పునరుద్ధరించుకోవాలని పేర్కొన్నారు. పుట్టిన శిశువు మొదలుకుని ఐదేళ్ల లోపు చిన్నారులందరికి తప్పనిసరిగా తల్లిదండ్రులు ఆధార్ నమోదు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.5 నుంచి 15 సంవత్సరాల లోపు గల ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేయించాలని సూచించారు. ఆధార్ కార్డులో చిన్న మార్పులకు నివాస ధృవపత్రం సరిపోతుందని, అయితే జన్మతేదీ సవరణకు తప్పనిసరిగా జన్మ ధృవపత్రం అవసరం అని స్పష్టం చేశారు.జన్మ ధృవపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్లు మరియు ఆర్డీవో కు ఆదేశించారు. విద్యార్థులు అపార్ కార్డు కోసం నమోదు చేసుకునే ముందు, వారి ఆధార్ వివరాలు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. పాఠశాలల్లోని విద్యార్థులందరి ఆధార్ బయోమెట్రిక్ ను అప్ డేట్ చేయించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. తద్వారా భవిష్యత్తులో జేఈఈ,నీట్ వంటి పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తవని సూచించారు.ఆధార్ నమోదు, అప్‌డేట్ కోసం మెగా క్యాంపులు నిర్వహించాలని సూచించారు.ఈ నవీకరణ ప్రక్రియకు సంబంధించి ఆధార్ సేవా కేంద్రాలకు తగిన చర్యలు తీసుకోవాలని ఈ డిస్ట్రిక్ మేనేజర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస రావు, ప్రాజెక్టు మేనేజర్ నరేష్, ఈ.డీఎం శివ, డీఎంహెచ్ఓ సిద్ధప్ప,లీడ్ బ్యాంకు మేనేజర్ అయ్యప్ప రెడ్డి,డీడబ్ల్యుఓ సునంద,మున్సిపల్ కమిషనర్లు, మీసేవ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాలకు సాగునీటిని విడుదల చేయాలి



భీమ పేస్-2 ప్రాజెక్టును పరిశీలిస్తున్న వేముల శ్రీనివాస్ రెడ్డి



ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్ రెడ్డి

### జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 24(ప్రభాత ఉదయం)పంట పొలాలకు సాగునీటిని విడుదల చేయాలని జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బీమా ఫెస్ 2 కింద ఉన్న మెట్ట వరి పొలాలను దేవరకద్ర స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశాలతో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయిలో సందర్శించి రైతుల సమస్యలను కష్టాలను తెలుసుకున్నారు. ఏనుగుంట రిజర్వాయర్, కొత్తకోట శంకర్ సముద్రం రిజర్వాయర్ ల లో నీటి స్టోరేజ్ లేకపోవడంతో ఎమ్మెల్యే జిఎంఆర్ సూచనతో నీటిపారుదల ఉన్నత స్థాయి అధికారులు, చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి, సూపరెంట్ ఆఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి సాగునీటి సమస్యను సాగు చేసిన రైతులతో కలిసి నీటిపారుదల శాఖ అధికారులను రైతులతో కలిసి సమస్యలు విన్నవించడం జరిగిందని చెప్పారు. ఉన్నంత అధికారులు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో అక్కడక్కడ నీటి ఎద్దడి ఉన్న కారణంగా రైతులందరూ సమన్వయంతో నీటిని వినియోగించుకోవాలని నీటిపారదల శాఖ అధికారులు సూచించారు. సాగునీటిని వృధా చేయవద్దని రేపటి లోపు కర్ణాటక రాష్ట్రం నుండి జూరాలకు వచ్చి చేరిన వెంబడే రిజర్వాయర్ లకు సాగునీటిని విడుదల చేస్తామని , రైతులు నీటిని అవసరానికి తగినట్టుగా వాడుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మిరాసిపల్లె, ముమ్మలపల్లె, బూత్కూర్, రాణి పేట, నాంచారం పేట, ఉల్లంకొండ రైతులు శేఖర్ రెడ్డి, కిరణ్, ఆంజనేయులు, రామ్ రెడ్డి, నాగరాజ్, సుదర్శన్ రెడ్డి, శేషన్న, శేఖర్ తదితర రైతులు పాల్గొన్నారు.



# బీజేపీని నిలువరించడంలో కాంగ్రెస్ విఫలం

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యం.వి రమణ

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి24(ప్రభాత ఉదయం) రాష్ట్రంలో విద్వేష రాజకీయాల ద్వారా బలపడాలని చూస్తున్న బీజేపీని నిలువరించడంలో కాంగ్రెస్ విఫలం అయిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యం.వి రమణ అన్నారు. సోమవారం అల్లంపూర్ చౌరస్తాలో జి. కే . ఈదన్న అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన విద్వేష రాజకీయాలతో తెలంగాణ ప్రజలను విడదీసే ప్రయత్నం చేస్తున్న బిజెపిని నిలువరించడంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విఫలం అయిందని అన్నారు. బడ్జెట్ లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటం చేయడం లేదన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 నగదును బోనస్ గా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ రైతుల ఖాతాలలో ఎందుకు నగదును జమ చేయలేదని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక మిర్చి శనగ వంటి పంటలు పొలాలలోనే ఉన్నాయని అన్నారు. ఆర్థిక పరిస్థితి పేరుతో సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తే ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి మాట్లాడుతూ... కోట్లాది రూపాయల ప్రజాధనంతో అలంపూర్ చౌరస్తాలో ఏరియా ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన ఇంకా ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. నియోజకవర్గ వాసులకు అందుబాటులో ఆసుపత్రి ఉన్నా ,కర్నూల్ కు వెళ్లాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఎందుకు తీసుకువచ్చారో పాలకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలంపూర్ చౌరస్తాలో బస్టాండ్ నిర్మిస్తామని చెప్పిన పాలకుల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీ ప్రాంతాలలో పేదలు ఇండ్లు ఇళ్ల స్థలాలు లేక అల్లాడుతుంటే అధికార అండదండలతో అనధికారికంగా ప్రభుత్వ స్థలాలు,10శాతం ల్యాండ్స్ కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తుంగభద్ర నీటిని తుమ్మిళ లో నిల్వ చేయకపోవడం వల్ల తుమ్మిళ్ళ పథకం కింద ఉన్న భూములకు సాగునీరు అందదని కావున నీటిని తుమ్మిళ్ల లో నిల్వ చేసిన తర్వాతే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణ నీటిని పూర్తి స్థాయిలో అందించి సాగు త్రాగు సాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, జిల్లాలో రబీ సీజన్ కు సంబంధించి పంటలకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.రాజు, ఏ.పరం జ్యోతి ,ఉప్పేర్ నరసింహ, నర్మద, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీలంక అదుపులో 700పైగా బోట్లు

### రామేశ్వరంలో మత్స్యకారుల ఆందోళన

చెన్నై, ఫిబ్రవరి24(ప్రభాత ఉదయం) తమిళనాడులోని రామేశ్వరంలో మత్స్యకారులు సోమవారం నుండి నిరవధిక సమ్మెకు దిగారు. శ్రీలంక నేవీ నిర్బంధంలో ఉన్న మత్స్యకారులను, పడవలను వంటనే విడుదల చేయాలని మత్స్యకారుల సంఘం డిమాండ్ చేస్తోంది. 700కిపైగా బోట్‌లను హార్బర్‌లో నిలిపివేయడంతో రామేశ్వరంలోని ఫిషింగ్ హార్బర్ నిర్మానుష్యంగా మారింది. శ్రీలంక నేవీ నిర్బంధించిన బందీలను వెంటనే విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానం చేసినట్లు రామేశ్వరం మత్స్యకారుల సంఘం కార్యదర్శి సగాయం పేర్కొన్నారు. మత్స్యకారుల బోట్లను వేలం వేయకుండా చూడాలని కోరారు. త శనివారం రామేశ్వరం నుండి 440 బోట్లలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లారు. పాల్క్‌బే సముద్ర ప్రాంతంలో చేపల వేట సాగిస్తుండగా, శ్రీలంక నేవీ అధికారులు పెట్రోలింగ్ బోట్‌లో అక్కడికి చేరుకున్నారు. అంతర్జాతీయ సముద్ర సరిహద్దును దాటారంటూ 5 పడవలను, 32 మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకున్నారు. భారతీయ మత్స్యకారులను శ్రీలంకనేవీ అదుపులోకి తీసుకుంటున్న ఘటనలు పెరగడంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం సంయుక్త కార్యవర్గాన్ని (జెడబ్ల్యుజి) సమావేశపరచాలని విదేశాంగమంత్రి జై శంకరకు రాసిన లేఖలో పేర్కొన్నారు. గత జనవరి నుండి 131 మంది తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నేవీ అదుపులోకి తీసుకుంది. 18 బోట్లను స్వాధీనం చేసుకుంది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608